# ప్రజా ఉద్యమకారులను-ప్రగతిశీలశక్తులను హెచ్చరిస్తున్న 2024 జనరల్ ఎన్నికలు

## వాగ్దానాల మీద వాగ్దానాలు, వాగ్యుద్ధాలు, దౌర్జన్యాలు, డబ్బు పంపకం చేయడంలో పోటీపడిన బూర్జువా పార్టీలు

విశ్వం

**భారతదేశ** పార్లమెంటరీ రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. దశాబ్దాల కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ భూస్వాములకు, బడా బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదులకు సేవ చేసి, చేసి ప్రాభవాన్ని కోల్పోయింది. దాని స్థానంలో మరో బూర్జువావర్గ కూటమి అధికారంలోకి వస్తూ పోతూ బిజెపి రూపంలో గత దశాబ్దకాలం తన చురుకుతనాన్ని, బుద్ధికుశలతను భూస్వామ్య, బూర్జువావర్గాల, సామ్రాజ్యవాదుల సేవకు ఉపయోగించింది. ఈ లభించిన అధికారాన్ని తన మూలపుటమ్మ ఆర్ఎస్ఎస్ హిందూమత సిద్ధాంత వ్యాప్తికి, దానిని తిరుగులేని విధంగా నెలకొల్పడానికి సాధనం చేసుకొంది.

భారత పార్లమెంటరీ, రాజ్యాంగ వ్యవస్థ నిరంకుశ స్వభావాన్ని 1950 దశాబ్దం నుంచి భారతదేశ పీడిత వర్గాలు చవిచూస్తూనే వున్నాయి. 1940లలో రైతాంగ, కార్మికవర్గ ఉద్యమాలతోపాటు బ్రిటీష్ సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలను అణచడానికి 1930ల నాటి రాజ్యాంగ చట్టమే సాధనమయింది. దాని ఒరవడిలోనే 1956 రాజ్యాంగ చట్టం. కార్మిక, రైతాంగ ఉద్యమాలను, ప్రజాస్వామిక విప్లవోద్యమాలను అణచడానికి సాధనం చేసుకొంది.

జాతుల స్వయం నిర్ణయాధికార సమస్య; పీడిత దళిత కులాల, వెనుకబడిన కులాల రక్షణ సమస్య; ఆదివాసీ ప్రజల రక్షణ సమస్య – గత 70 సంవత్సరాల కాలంలో ఒక విస్పష్టమైన, ఖరాఖండి రూపంలో పరిష్కరించకుండానే భారత బడాబూర్జువా వర్గం, తన కుయుక్తులతో సాగదీస్తూ వచ్చింది. బుజ్జగింపులు, బెదిరింపులు, అణచివేతలు ఒకవైపు, హామీలు, రాయితీలు, సంస్కరణల ప్రకటనలు మరోవైపు ప్రయోగిస్తూ పీడిత ప్రజలను దగాచేస్తూ వచ్చింది. నిరుద్యోగ సైన్యాన్ని పెంచింది. స్వయం ఆధారిత వ్యవసాయ విధానం, స్వతంత్ర పారిశ్రామిక విధానం – వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పరస్పర అభివృద్ధికి బదులు పరాధీన విధానాలను అనుసరించింది. దీని ఫలితంగానే నిరుద్యోగ సైన్యం – విద్యావంతులయిన యువకులు – పరిమిత విద్య గల యువకులు, అసలు విద్యకు నోచుకోని మారుమూల గ్రామీణ యువత – ఈ మొత్తాన్ని కలిపి నిరుద్యోగ సైన్యం అంటున్నాం. అత్యంత నీచమైన, అమ్ముడుపోయిన విధానాల మూలంగా సంభవిస్తూ వచ్చిన, ఈ పరిణామమే నిరుద్యోగ పరిస్థితి ఇంతగా పెరగడానికి కారణం.

గ్రామస్వరాజ్యం, స్వయం ఆధారిత విధానం, సహకార ఉద్యమం, సోషలిస్టు నమూనా ఆర్థిక విధానం, అలీన విదేశాంగ విధానం, స్వతంత్ర రక్షణ రంగం, నీటివనరుల ప్రాజెక్టులు, భూసంస్కరణల విధానాలు, లౌకిక– ప్రజాస్వామిక ప్రకటనల ఆర్భాటం నుండి, ఆకుపచ్చ విప్లవం, గరీబీ హటావో, బ్యాంకుల జాతీయాకరణ, భూపరిమితి చట్టం, ఇరుగు పొరుగులతో యుద్ధం, సామ్రాజ్యవాదులతో రక్షణ ఒడంబడికలు, ఆయుధ ఒప్పందాలు, సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలకు మౌలిక అండదండలు, దేశ ప్రజలను అణచడానికి మీసా, నాసా, ఉపా, డిఐఆర్ లాంటి చట్టాలతో ప్రజాస్వామికశక్తుల జీవితాలతో ఆడుకుంది. రైతాంగ ఉద్యమ నేతలను, కార్యకర్తలను హింసకు గురి చేసింది. ప్రజలపై హత్యాకాండ జరిపింది, పారిశ్రామిక శాంతి పేరుతో కార్మిక వర్గాన్ని అణచివేయడం, బడాపెట్టుబడిదారులతో కలిపి విదేశీ పెట్టుబడిని ఆహ్వానించడం, సమ్మెలు జరగనివ్వమనే హామీ, గ్యారెంటీలనిచ్చి శ్రమజీవులు లొంగి వుండేట్లు చేయడం, నోరు మెదపనీయకుండా చేయడం లాంటి విధానాలు చేపట్టింది. ఆ తర్వాత 1990 దశకంలో గాట్ ఒప్పందం, సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలీకరణ విధానాలను రుద్దింది. సాంస్కృతికంగా వ్యక్తివాదానికి పెద్దపీట వేసింది. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాలలో దశాబ్దాల పూర్వం నుంచే అమలు జరపబడుతూ వున్న ఆధునికాంతర సిద్ధాంతాలను అనేక పద్ధతులతో పోషిస్తూ నిలబెడుతూ, శ్రామికవర్గ పోరాటాల, ప్రజాస్వామిక ఉద్యమాల అవసరాన్నీ, ప్రాధాన్యతను నీరుగారుస్తున్నారు.

## II

గత భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితి కొనసాగింపుగానే పదేళ్ల బిజెపి పాలన వుంది. జోడింపుగా హిందూరాజ్య స్థాపన లక్ష్యాన్ని భారత ప్రజలపై రుద్దడానికి ఫాసిస్టు పద్ధతులనాశ్రయించింది.

2014 ముందు నుంచే లాల్ క్రిష్ణ అద్వానీ రథయాత్ర, అయోధ్య బాబ్రీ మసీదు వివాదం, బాబ్రీ మసీదుకి యిటుకలు తీసుకురండని శిలాన్యాస్ రామభక్తులకు పిలుపునివ్వడం లాంటి హిందూమత ప్రాశస్త్యాన్ని చాటే పేరుతో మతతత్వ భావోద్రేకాలకు పునాదిరాయి వేశారు.

బిజెపి పాలన గత ప్రచారపు కొనసాగింపు గానే హిందూ రాజ్యం, అయోధ్యలో రామమందిర నిర్మాణం, వారణాసి జ్ఞానవాసి సమస్యలతో హిందూమత భావోన్మాదాన్ని పెంచడానికి పూనుకొంది. భారతదేశ బడా బూర్జువావర్గానికి, విదేశీ పెట్టుబడిదారులకు సేవలు చేస్తూ అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు వంత పాడుతూ, దేశంలో ప్రాంతీయ విభేదాలను రెచ్చగొడుతూ విభజించి పాలించు అన్న దోపిడీ సూత్రాన్ని అమలు జరిపింది. ముస్లిం రిజర్వేషన్లు తీసివేస్తామని హిందూమత

శక్తులకు, రిజర్వేషన్ వ్యతిరేక వాదులకు సంతోషం కలిగించే ప్రకటనలు చేసింది. విదేశాలలో వున్న (స్విస్ బ్యాంకులో) దాచుకొన్న మిలినీయనర్ల డబ్బంతా తెస్తానన్న మాటను వదిలేసి, నోట్లరద్దు, జిఎస్టిలతో డబ్బుగల అత్యంత ధనికులకు ఉపకరించే చర్యలను చేపట్టింది. ఆదాని, అంబానీల సేవలో మునిగింది.

బూర్జువా ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వ ఈ చర్యలను ఆసరా చేసుకొని ఇండియా కూటమిగా ఏర్పడి బూర్జువా పార్టీలను, పార్లమెంటరీ ప్రతిపక్షాలను సమీకరించే కర్తవ్యాన్ని చేపట్టాయి. అట్టహాసంగా ముందు కొచ్చిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్, బెంగాల్ ముఖ్యమంత్రి మమత వెనక్కుపొయ్యారు. వామపక్ష ప్రతిపక్షం, రివల్యూషనరీ ప్రతిపక్ష శక్తులు కొందరు 'ఇండియా' కూటమిని స్వాగతించాయి. ఫాసిస్టు ప్రమాదం – హిందూ ఫాసిస్టు ప్రమాదంను ఎదుర్కొనడం నేటి కర్తవ్యంగా స్వీకరించాయి. ఎన్నికల నినాదంతో ప్రచార ఉధృతిని పెంచాయి. Indian National Developmental Inclusive Alliance (ఇండియా) పేరు పెట్టుకొని ఇండియా కూటమిలోని వారు కొన్ని చోట్ల పరస్పరం పోటీ చేసుకున్న సందర్భాలూ వున్నాయి. అయినప్పటికీ కూటమిని చివరిదాకా ఓపికతో నిలబెట్టుకొచ్చారు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా పరిస్థితిని బట్టి సమన్వయం చేసుకోవడంలో కూటమి నాయకుడు ఖర్గే సఫలీకృతుడయ్యాడు.

వివిధ రాష్ట్రాలలో ఫ్యూడల్ బూర్జువా వర్గంలోని వైరుధ్యాలు బద్ధలయ్యాయి. వీరిలో కొంతమంది కూటమిని ఆశ్రయించారు. కూటమి గెలిస్తే ప్రధానమంత్రి ఎవరన్న సమస్య గూడ కూటమికి ఒక సమస్యగానే ముందుకొచ్చింది. పార్లమెంటు సీట్ల కేటాయించు కోవడంలో వచ్చిన సమస్యలున్నాయి.

బిజెపి ఫాసిస్టు పోకడలను భరించి బాధలకు గురైన శక్తులు, దాని హిందూమత ఉన్మాదాన్ని భరించలేని ప్రజాస్వామిక శక్తులకు హిందూమతేతర ప్రజానీకం మోడీని గద్దె దించాలనే పట్టుదలను ప్రదర్శించాయి. కొన్ని కమ్యూనిస్టు, విప్లవ శక్తులు ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వ్యవహరించారు. తమ మౌలిక కర్తవ్యం నుంచి ప్రక్కకు పోకుండా ఈ ఎన్నికలలో బిజెపి మోడీని గద్దె దించాలనే వైఖరి తీసుకుని ఎండగట్టే కార్యక్రమం చేబట్టారు. అయితే బిజెపి ఓడిపోయి ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతయనే భ్రమలలో కమ్యూనిస్టు విప్లవకారులు లేరు. కాంగ్రెస్ మౌలిక విధానాలను – బడా బూర్జువావర్గ అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను వదులుకుంటుందన్న భ్రమలలో లేరు. ఒక బూర్జువాశక్తి స్థానంలో మరో బూర్జువాశక్తి పైకెక్కగలుగుతుంది. వామపక్షశక్తులు బూర్జువా అధికార సాధన భ్రమలలోనే మిగిలిపోతారు.

ఫాసిజానికి వ్యతిరేక ఐక్య కార్యక్రమాలు, సంఘటన ఏర్పాటుకి ప్రయత్నం చేసిన కొన్ని విప్లవ శక్తులు, 'ఇండియా' ఏర్పాటుని స్వాగతించాయి. పార్లమెంటరీ పద్ధతుల ద్వారా కూడా ఫాసిస్టు ప్రమాదానికి సంకెళ్లు వేయవచ్చున్న ఆలోచనతో బిజెపిని ఈ ఎన్నికలలో ప్రమాదకరమైన శక్తిగా గుర్తించి ఓడించాలన్న పిలుపునిచ్చారు. అదే సందర్భంలో ఇండియా కూటమి విధానాలను తలకెత్తుకొన్నారని అనుకోలేము. ఇండియా కూటమి ప్రయత్నాలు ఫలించాయి. ఇప్పటివరకు ఇండియాలో చేరని బిజెపి వ్యతిరేక శక్తులు ఇండియాలో చేరి బిజెపికి అవకాశం లేకుండా చేస్తారని ఆశిద్దాం.

* * * * *